క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి తిరునాల

తంబళ్లపల్లె: మండలంలోని కుక్కరాజుపల్లెలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి తిరునాల వైభవంగా జరిగింది. పూజారి మల్లయ్య స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారిని చాందినీ బండిపై పురవీధుల్లో ఊరేగించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి విద్యుత్‌దీపాలతో అలంకరించిన చాందినీబండ్లు పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపు నిర్వహించారు. బుధవారం కూడా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు స్వామిదర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎంపీపీ అనసూయమ్మ, సింగిల్‌విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి, సర్పంచ్ రామ్‌రాజ్, మండల అభివృద్ధికమిటీ చైర్మన్ నారాయణరెడ్డిలు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కమనీయం.. కల్యాణోత్సవం

రామసముద్రం : రామసముద్రం మండలంలోని నరసాపురం గ్రామంలో శ్రీముక్కంటీశ్వరస్వామి ఉత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

వైభవం.. గరుడోత్సవం

రామసముద్రం : రామసముద్రం మండలంలోని చెంబకూరులో వెలసిన శ్రీగట్టు వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం వైభవంగా గరుడోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం చెంబకూరు పురవీధుల్లో స్వామివారిని గరుడోత్సవంపై మేళతాళాల నడుమ, కోలాట , చెక్కభజనలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆయోధ్యకు చేరే శ్రీరామ పాదుకలకు పూజలు



బి.కొత్తకోట చేరిన జల కలశాలు, పాదుకలు

బి.కొత్తకోట : అయోధ్యలో నిర్మాణంలోని శ్రీరాముని ఆలయానికి చేరే 16 నదుల జలం, శ్రీరాముని పాదుకలకు బుధవారం బి.కొత్తకోటలో భక్తులు పూజలు నిర్వహించారు. కర్ణాటకలోని శృంగేరి నుంచి ఆయోధ్యకు వెళ్తున్న వీటిని బి.కొత్తకోట ఆర్యవైశ్య వీధికి తీసుకొచ్చారు. వీటిని దర్శించుకొన్న భక్తులు పూజలు చేశారు. వీటి దర్శనార్థనం ఇంటింటికి తీసుకెళ్లగా సుమారు వంద కుటుంబాలకు చెందిన వారు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఆర్పీఎఫ్ కేంద్రంలో హోలీ సంబరాలు

కలికిరి : మండల పరిధిలోని సీఆర్పీఎఫ్ (సీఐఏటీ-3) కేంద్రంలో బుధవారం హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. కేంద్రంలోని అధికారులు, జవాన్‌లు కలిసి రంగులు చల్లుకున్నారు. కులమతాలకతీతంగా సోదరభావానికి ప్రతీకగా హోలీ జరుపుకుంటారని సీఆర్పీఎఫ్ కమాండెంట్ కేసీ నిర్మల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్‌లు ఏకే సింగ్, కదమ్‌సింగ్, నందన్వార్, హనుమాన్ రామ్, అసిస్టెంట్ కమాండెంట్‌లు రవికుమార్, హనుమాన్ రామ్, గిరిధర్(పీఎస్), జవాన్‌లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సారా ఊట ధ్వంసం

పీలేరు రూరల్ : సారా తయారీకి సిద్ధంగా ఉన్న 400 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ వై. గురుప్రసాద్ తెలిపారు. మండలంలోని గూడరేవుపల్లె పంచాయతీ పుట్టావాండ్లపల్లె సమీపంలో సారా తయారీ చేస్తున్నట్లు అందిన సమాచారంతో బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సారా బట్టీలు గుర్తించి సారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడిలో ఎస్ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది లోకేష్, సుధాకర్, సురేష్ పాల్గొన్నారు.

రెడ్డెమ్మకు ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్త అవార్డు



రెడ్డెమ్మను సత్కరిస్తున్న దృశ్యం

పీలేరు : స్థానిక సుబ్బాచారి వీధి అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సి.పి. రెడ్డెమ్మకు ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్త అవార్డు లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇన్‌చార్జి పీడీ ధనలక్ష్మీ చేతుల మీదుగా రెడ్డెమ్మకు దుశ్శాలువతో సత్కరించడం తోపాటు జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డెమ్మకు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో రాజమ్మ, వైఎస్సార్‌టీయూసీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పథకంలోనూ మహిళలకు పెద్దపీట

- మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు
- ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



నిమ్మనపల్లె : దళితవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు



పీలేరు: పంచాయతీ కార్యాలయంలో మహిళలకు సన్మానం

మదనపల్లె : సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలను విస్మరించి అభివృద్ధి సాధించటం అసాధ్యమని భావించే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పథకంలోనూ మహిళకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ పెద్దపీట వేస్తున్నారని ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలో పలుచోట్ల ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కోళ్లబైలు పంచాయతీ అమ్మచెరువుమిట్ట వెలుగుప్రత్యేక పాఠశాలలో జరిగిన మహిళాదినోత్సవ వేడుకల్లో షమీంఅస్లాం, ఫోర్డ్ వ్యవస్థాపకురాలు జల్లాలలితమ్మ, వెలుగు కమిటీ మెంబర్ సుజాత ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వెలుగు వృద్ధాశ్రమంలోని వృద్ధులు, సిబ్బందితో కలిసి మహిళా దినోత్సవ సందర్భంగా కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం మాట్లాడుతూ... మహిళకు భూదేవి అంత సహనం ఉంటుందని, ఎలాంటి సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. పుట్టిన బిడ్డ నుంచీ ముదుసలి అవ్వవరకు ప్రతి ఒక్కరికీ అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తూ మహిళా సాధికారతకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోందన్నారు. పోర్డ్ లలితమ్మ మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లో వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ ఆర్. భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, సోషల్‌వర్కర్ గీత, వెలుగు సిబ్బంది, వృద్ధులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

పుట్టిన శిశువు నుంచి తనువు చాలించే వరకు అనేక రకాలైన రక్షణ చట్టాలు మహిళలకు అనుకూలంగా ఉన్నాయని టూటౌన్ సీఐ మురళీకృష్ణ అన్నారు. స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ..సృష్టిలో అత్యంత ప్రాముఖ్యమైన పాత్ర మహిళదేనని, వారి సేవలు వెలకట్టలేనివన్నారు. మహిళల రక్షణ కోసం రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా దిశ చట్టం, యాప్‌ను తీసుకువచ్చిందని, దీనిని ప్రతి మహిళ ఆపద సమయాల్లో సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా సిరికల్చర్ సైంటిస్ట్ దీప, ప్రిన్సిపాల్ రమాదేవి, జల్లాలలితమ్మను ఘనంగా సన్మానించారు.

అలాగే 14వవార్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎస్.ఏ.కరీముల్లా, కౌన్సిలర్ షేక్ షబానా ఆధ్వర్యంలో వార్డులో సేవాకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే ముగ్గురు మహిళలను ఘనంగా సన్మానించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పీలేరు : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మహితాఆనంద్, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మహిళల పాత్ర ఒక తల్లిగా, ఒక చెల్లిగా, భార్యగా అనితరసాధ్యమని పేర్కొన్నారు. గ్రామ సచివాలయ మహిళా సిబ్బంది, పారిశుద్ధ కార్మికులను దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. అలాగే శ్రీ భువన విద్యాలయం, వెలుగు కార్యాలయంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హరిత, నాగరాజమ్మ, నీరజ, రాజలక్ష్మీ, సపూరా తదితరులు పాల్గొన్నారు.

రాచవేటివారిపల్లెలో..

నిమ్మనపల్లె : మండలపరిధిలోని రాచవేటివారిపల్లె పంచాయతీ దళితవాడలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి శోభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. మహిళల భద్రతకు మరింత కట్టుదిట్టమైన చట్టాలు అమలుచేయాలని కోరారు. 55 సంవత్సరాలు నిండిన గ్రామీణ మహిళలకు రూ.5వేలు ఫించన్ ఇవ్వాలని నిర్ణయం చేశారు. కార్యక్రమంలో ఏపీవీవీయూ కమిటీ సభ్యులు నాగరత్న, రామలక్ష్మి, మల్లేశ్వరి, యశోదమ్మ, విశ్వనాథ్, జయన్న తదితరులు పాల్గొన్నారు.



ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాంను సన్మానిస్తున్న వెలుగు సిబ్బంది



పోర్డ్ లలితమ్మను సన్మానిస్తున్న టూటౌన్ సీఐ మురళీకృష్ణ

మహిళా కండక్టర్లకు బహుమతులు

మదనపల్లె సిటీ : విధి నిర్వహణలో ప్రతిభ చూపిన ఆర్టీసీ మహిళా కండక్టర్లను జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి బహుమతులు అందజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సం పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ 2 డిపోకు చెందిన పి.గిరిజమ్మ, వన్ డిపోకు చెందిన హేమవతిలకు క్యాష్ అవార్డుతో పాటు ప్రశంసాపత్రాలను జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి జగదీష్ అందజేశారు. విధి నిర్వహణలో ఆదాయం పెంచడంతో పాటు సెలవులు కూడా తీసుకోకుండా విధులకు హాజరుకావడంతో అవార్డులను అందజేసినట్లు ఆర్టీసీ 2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. వీరిని డీఎం వెంకటరమణారెడ్డి, సీఐలు రేవతి, గీత, సిబ్బంది అభినందించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని కాలేజీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మహిళా అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సతీష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రోత్సాహక బహుమతి అందుకుంటున్న కండక్టర్ గిరిజమ్మ

మహిళలు ఆత్మవిశ్వాసంతో ఎదగాలి

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, ఎమ్మెల్యే నవాజ్‌బాషా



ప్రిన్సిపాల్ ఉమాఅమరేశ్వరిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

మదనపల్లె: మహిళలు అన్ని రంగాల్లోనూ ఆత్మవిశ్వాసంతో ఎదగాలని ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషాలు అన్నారు. బుధవారం సాయంత్రం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక జెసీఎం కమ్యూనిటీ హాలులో భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షులు పీటీఎం శివప్రసాద్ మాతా రమాబాయి అంబేడ్కర్ మెమోరియల్ అవార్డులు కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు సమానమేనని ప్రతి ఒక్కరూ వారిని గౌరవించాలని అన్నారు. భారత రాజ్యాంగం ద్వారా సమానహక్కులను మహిళలు పొందేలా చేయాలన్నారు. ప్రతి ఆడబిడ్డకు చదువు అందివ్వాలని, సరైన మార్గాన్ని తల్లిదండ్రులు నిర్దేశించాలన్నారు. మహిళలకు సమాజంలో ఎదురయ్యే సమస్యలపై ఇంటి నుంచే అవగాహన పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని విభాగాల్లోనూ పెద్ద పీట వేస్తోందన్నారు. అనంతరం వివిధ రంగాల్లో నిపుణులైన మహిళలకు ఎమ్మెల్యే, ఎస్సీ కమిషన్ చైర్మన్ చేతుల మీదుగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకిపురం ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపాల్ ఉమాఅమరేశ్వరి, సిరికల్చర్ సైంటిస్టు దీప, ఫోర్డు లలితమ్మ, సుభద్ర, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, రిటైర్డు ఎంఈఓ రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సమగ్ర భూ సర్వే



నడింపల్లె వద్ద డ్రోన్ కెమెరాతో సర్వే చేస్తున్న అధికారులు

కురబలకోట : మండలంలోని వివిధ గ్రామాల్లో సమగ్ర భూ సర్వేని ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఎం. బీమేశ్వర రావు తెలిపారు. బుధవారం ముదివేడు, నడింపల్లె గ్రామాల్లో డ్రోన్ కెమెరాలతో సర్వే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీ సర్వే వల్ల రైతులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. ఆధునిక డ్రోన్ సాంకేతిక సహకారంతో రైతులకు సంబంధించిన ప్రతి అంగుళం భూమి కూడా గుర్తించడం జరుగుతుందన్నారు. రైతుల భూములకు సరిహద్దులు నిర్ణయించనున్నట్లు తెలిపారు. వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, ఆలయ భూములు, గ్రామకంఠాలు, డీఫాం పట్టాలు తదితర భూములను సమగ్రంగా సర్వే చేసి గుర్తిస్తున్నామన్నారు. భూ వివాదాలు పరిష్కారం అవుతాయన్నారు. సర్వేయర్ భువనేశ్వరి, వీఆర్వో వేణుగోపాల్‌రెడ్డి, సచివాలయ సర్వేయర్లు శివరాజు , సులోచన తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పూరిగుడిసె దగ్ధం



దిగువబోంపల్లిలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రామసముద్రం : రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె పంచాయతీ దిగువబొంపల్లెకు చెందిన సుధాకర్ పూరిగుడిసె ప్రమాదవశాత్తు బుధవారం అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న పుంగనూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపే ఇంటిలో ఉన్న బియ్యం, దుస్తులు, వంట సామగ్రి పూర్తి కాలి బూడిదయ్యాయి. అగ్నిప్రమాద సమయంలో ఇంటిలో ఎవ్వరులేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. వంట చేసిన తరువాత నిప్పులు ఆర్పకపోవడంతో ఒక్కనే ఉన్న వంట సామగ్రికి నిప్పు అంటుకోవడంతో గుడిసె కాలిపోయినట్లు బాధితుడు సుధాకర్ తెలిపారు. సుమారు లక్షరూపాయల మేరకు నష్టం జరిగినట్లు అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు. మంటలు ఆర్పడంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు , సిబ్బంది సుమన్, ఎం.లోకేష్‌రెడ్డి, వినోద్, వెంకటరమణ, పాల్గొన్నారు.

12న ముదివేడు తిరునాల

కురబలకోట : మండలంలోని ముదివేడు దండు మారెమ్మ తిరునాలను ఈనెల 12న వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు, చాందినీ బండ్లు మెరువన చేపట్టనున్నట్లు తెలిపారు. 13న తిరునాల మహోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. తిరునాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ కేశప్ప వెల్లడించారు. ఎప్పటిలా రికార్డింగ్ డ్యాన్సులను నిషేధించినట్లు ముదివేడు ఎస్ఐ సుకుమార్ తెలిపారు.

గర్భిణీ మృతిపై విచారణకు డిమాండ్

మదనపల్లె : మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో ప్రసవం జరిగిన కొన్ని గంటలకే గర్భిణీ మృతి చెందిన సంఘటనపై జిల్లా డీసీహెచ్ఎస్ విచారణ చేపట్టాలని ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రసవం జరిగే సమయంలో గైనకాలజిస్టు ఎందుకు లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటూ ఆస్పత్రిలో అందుబాటులో లేకపోవడంపై మండిపడ్డారు.గర్భిణీ మృతిపై విచారణ చేసి, నిర్లక్ష్యంగా వ్యవహరించి వైద్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

లారీ క్లీనర్‌పై దాడి

మదనపల్లె : లారీ క్లీనర్‌పై కొందరు వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన పట్టణంలో మంగళవారం రాత్రి జరిగింది. పట్టణంలోని ఎస్టేట్‌కు చెందిన ఎస్.నవాజ్‌బాషా (26) లారీ క్లీనర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇతను స్థానికంగా ఉన్న చిల్లర దుకాణంలో సరుకులు కొనుగోలు చేస్తుండగా ఇరు వర్గాల వారు గొడవపడ్డారు. అక్కడే ఉన్న నవాజ్‌బాషా అడ్డుకుని గొడవపడవద్దని వారించాడు. దీంతో ఆగ్రహించిన వారు బాధితునిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దాడిలో నవాజ్‌బాషా తీవ్రంగా గాయపడగా, కుటుంబ సభ్యులు అతడిని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కమనీయం.. స్వామివారి చక్రస్నానం



స్వామివారి చక్రస్నాన మహోత్సవం

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చక్రస్నానం కమనీయంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు బుధవారం ఉదయాన్నే స్వామివార్లకు తోమాలసేవ, తిరుచ్చి ఉత్సవాలు నిర్వహించారు. స్వామివారి మండపంలో స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించారు. అర్చకులు రంగునీళ్లు, పసుపునీళ్లు ఒకరిపై ఒకరు చల్లుకొంటూ కోలాహలంగా వసంతోత్సవం, అనంతరం స్నపన తిరుమంజనం వైభవంగా జరిపించారు. స్వామివారి ఆయుధాలైన శంఖు, చక్రాలను పవిత్ర జలాలతో శాస్త్రోక్తంగా శుద్ధి చేస్తూ చక్రస్నాన మహోత్సవం నిర్వహించారు. వాహన మండపంలో రంగురంగుల పుష్పాలతో అలంకరించిన తిరుచ్చి వాహనంలో స్వామివారిని కొలువుదీర్చి గ్రామపురవీధుల గుండా ఊరేగించారు. తొమ్మిది రోజుల పాటు ఎటువంటి లోపాలు, ఆటంకాలు జరగకుండా బ్రహ్మోత్సవాలు ముగియడంతో ధ్వజావరోహణం నిర్వహించారు. ఏకాంత సేవతో ఉత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకొని స్వామివారికి పూజలు చేశారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవరుచుకోవాలి

- షబ్-ఏ-బరాత్ ప్రత్యేక ప్రార్థనల్లో మతగురువులు పిలుపు



ధార్మికోపన్యాసం చేస్తున్న ఇక్బాల్‌సాహెబ్

మదనపల్లె సిటీ : ప్రతి ఒక్కరూ దైవభక్తి, సత్ప్రవర్తనలను అలవరుచుకొని ముందుకెళ్లాలని ప్రముఖ మత గురువు మౌలానా హాఫీజ్ అప్సర్ అజీజీ సాహెబ్, ప్రభుత్వ సర్‌ఖాజీ హాఫీజ్ ఇక్బాల్ సాహెబ్‌లు పిలుపునిచ్చారు. ముస్లింల పవిత్ర పర్వదినమైన షబే-ఏ-బరాత్‌ను పురస్కరించుకుని పట్టణంలోని అన్ని మసీదులలోనూ మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు మత గురువులచే ధార్మికోపన్యాసాలు, ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. స్థానిక జామియా మసీదులో జరిగిన ప్రార్థనలలో మతగురువు మాట్లాడుతూ ఇస్లాం సూచించిన మార్గంలో నడవాలని తద్వారా ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించాలని కోరారు.

బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

కలకడ : ప్రభుత్వం బియ్యం కార్డు దారులకు అందించే ఉచిత బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే ఎండీయూ ఆపరేటర్లపై చర్యలు తప్పవని పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ వెంకటరెడ్డి, కోన వీఆర్‌ఓ రవిచంద్రన్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని నడిమిచెర్ల గ్రామంలో జరుగుతున్న బియ్యం పంపిణీ వాహనాన్ని తనిఖీ చేశారు. డీలర్ వద్దనుంచి తీసుకున్న స్టాక్, వాహనంలో నిల్వ ఉన్న స్టాకు బయోమెట్రిక్ యంత్రంలో నిల్వ ఉన్న స్టాక్ వివరాలను పరిశీలించారు. కార్డు దారులు తూకం సరిచూసుకుని తీసుకోవాలన్నారు. బియ్యం పూర్తిగా ఉచితమని, కేవలం చక్కర, కందిపప్పుకు మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన ధరలు చెల్లించాలని తెలియజేశారు.

ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ

పీలేరు రూరల్ : ప్రయాణికుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్ తిరిగి అప్పగించి కండక్టర్ తన నిజాయితీని చాటుకున్నాడు. చిన్నగొట్టిగల్లుకు చెందిన టీటీడీ ఉద్యోగి ద్వారకనాథ్ బుధవారం ఉదయం తిరుపతి నుంచి చిన్నగొట్టిరావడానికి పీలేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కాడు. సుమారు రూ. 15 వేలు విలువైన సెల్‌ఫోన్ బస్సులో పోగొట్టుకొని వెళ్లాడు. అయితే గమనించి కండక్టర్ రామయ్య సెల్‌ఫోన్‌ను జాగ్రత్తగా తీసుకొచ్చి డీఎం కుమార్‌కు అందించారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ద్వారకనాథ్‌ను గుర్తించి సమాచారం అందించారు. బాధితుకు సెల్‌ఫోన్ అందజేసిన కండక్టర్ రామయ్యను అభినందించారు. కార్యక్రమంలో బస్టేషన్ మేనేజర్ రెడ్డెప్ప, కంట్రోలర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : రాష్ట్ర అభివృద్ధి కోసం పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. బుధవారం వాల్మీకిపురంలో పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పట్టభద్రులను కలసి వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థి పర్వత చంద్రశేఖర్ రెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల్లో ఓటర్లందరూ విద్యాధికులు కావడంతో రాష్ట్ర అభివృద్ధికి అంకిత భావంతో పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. విద్యా, వైద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధికి, పేద వర్గాల సంక్షేమానికి పరితపిస్తున్న ముఖ్యమంత్రికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చింతల శివానంద రడ్డి, నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, అబ్దుల్ కలీమ్, నల్లంకి నరసిహులు, రాయుడు, రవీంద్రారెడ్డి, రవి, రమేష్, సైపుల్లా, చలపతి, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా పేర్నాటిని గెలిపించాలని ప్రచారం

పెద్దతిప్పసముద్రం : వైస్సార్‌సీపీ బలపరచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బుధవారం ఎంపీపీ మహమూద్, నాయకులు, ప్రజా ప్రతినిధులు సయ్యద్‌బాషా, సుబ్బిరెడ్డి, మునిరెడ్డి, పీఎస్ మధు, సాదిక్, లోకేష్, చెన్నకేశవరెడ్డి, నరసింహులు, షమీం తదితరులు మండలంలోని బూర్లపల్లి, మల్లెల, తుమ్మరకుంట. టి.సదుం పంచాయతీల్లో విస్తృతంగా పర్యటించి రాష్ట్రంలో జరుగుతున్న అభివద్ధిని చూసి పేర్నాటిని గెలిపించాలని పట్టభద్రులను అభ్యర్థించారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఇంటింటా ప్రచారం

బి.కొత్తకోట : తూర్పు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ బి.కొత్తకోట మండలంలో బుధవారం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. మండలంలో 1,342 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. బి.కొత్తకోట నగర పంచాయతీ, శీలంవారిపల్లె పంచాయతీల్లో నాయకులు ఇంటింటికి వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు.

శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించండి

తంబళ్లపల్లె : వైఎస్సార్‌సీపీ మద్దతుతో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. బుధవారం కుక్కరాజుపల్లె, రెడ్డికోటలలో మండల అభివృద్ధికమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి, నాయకులు జగదీష్, పద్మనాభరెడ్డి, శంకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో కరపత్రాలు పంచారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు.

పేర్నాటిని గెలిపించి జగన్‌కు కానుకగా ఇద్దాం

కురబలకోట : వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని గెలిపించి సీఎం జగన్‌కు కానుకగా ఇవ్వాలని మండల యువజన నాయకులు మీసేవ రవి, కొండతూర్పు అమరనాథరెడ్డి కోరారు. బుధవారం వారు మండలంలోని కొండతూర్పు గ్రామాల్లో పేర్నాటి విజయం కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.